# ఎలుక - ముని - కన్య





అనగనగా ఒక ముని పుణ్యతీర్థాలన్ని తిరుగుతూ ఒక రోజు గంగా నదిలో స్నానము చేస్తూ సూర్యుడికి అర్ఘ్యం సమర్పిస్తూ ఉన్నాడు.ఆ సమయంలోనే ఆకాశంలో డేగ ఒకటి ఎలుకని ఒక దాన్ని తన్నుకుని పోతూ పట్టుజారి ఎలుకని వదిలివేసింది. ఆ ఎలుక సరాసరి వచ్చి ఆ ముని చేతుల్లో పడింది. అప్పుడు ముని ఆ ఎలకని చూసి దయ తలచి " ఈ మూషికము కన్య అగు గాక" అని పలికాడు. వెంటనే ఆ ఎలుక కన్యగా మారి పోయింది.

అప్పుడు ఆ ముని ఆ కన్యని తీసుకుని పోయి తన భార్య కి ఇచ్చాడు. ఆమె ఈ కన్యని తన స్వంత కుమార్తె కన్నా ఎక్కువగా ప్రేమించి పెంచసాగింది. నెమ్మదిగా ఈ కన్యకి యౌవనం వచ్చింది. సరే ఇంత అందమయిన కన్యని సామాన్య మానవుడికి ఇవ్వకూడదు అని తలిచి ముని తన మంత్రములతో సూర్యుడిని స్మరించాడు. సూర్యభగవానుడు ప్రత్యక్షమయ్యాడు. ముని సూర్యుడికి నమస్కరించి " నీవు ఈ కన్యకను భార్యగా స్వీకరించు" అని కోరాడు.

PDF created with pdfFactory trial version www.pdffactory.com

సూర్యుడు " ఈ సుందరిని వరించటానికి మహాబలిష్టుడయిన వాయు దేవుడు ఒక్కడే అర్హుడు, పైగా నా కన్నా ఎక్కువ సంపదలు కలవాడు" అని చెప్పి మాయమయిపోయాడు.

అప్పుడు ఆ ముని తన తపఃశ్శక్తితో వాయుదేవుడిని స్మరించాడు. వెంటనే వాయుదేవుడు ప్రత్యక్షమయ్యాడు. "నా కూతురు అయిన ఈ కోమలిని వివాహమాడు" అని ముని వాయుదేవుడికి చూపించగానే , వాయుదేవుడు మెల్లగా ఇలా అన్నాడు " దేవ రాజు ఇంద్రుడు నాకంటే గొప్పవాడు. అతన్ని కాదు అని ఇతరులకి ఇవ్వటం న్యాయం కాదు. అతనికిచ్చి పెళ్ళి చేస్తే మీ అమ్మాయి సకల స్వర్గ సౌఖ్యాలు అనుభవిస్తుంది" అని చెప్పి వాయుదేవుడు కూడా వెళ్ళిపోయాడు.

అప్పుడు తన మంత్ర మహిమలతో ముని ఇంద్రుడిని ఆరాధించగా దేవేంద్రుడు ప్రత్యక్షమయ్యాడు. ముని కోరిక విని ఆ కన్య జన్మించిన విధం గ్రహించి , లోపల నవ్వుకుని ఇలా అన్నాడు. " మేరుపర్వతం మీకు, మాకు అందరికి పూజనీయుడు. అతడు ధనికుడు, సత్యవంతుడు, కాబట్టి నీ పుత్రికని మేరువుకి ఇచ్చి పెళ్ళి చేయటం మేలు" అని చెప్పి ఇంద్రుడు అంతర్ధానం అయ్యాడు.

"ఇదేమిటి పిలిచి పిల్లనిస్తాను అంటే ఒక్కళ్ళు కూడా అంగీకరించట్లేదు ఏమిటో" అనుకుంటూ ముని మేరువుని తలిచాడు. వెంటనే మేరువు ఒక సుకుమార రూపములో ముని ముందు నిలిచాడు. ముని ఆతనికి గౌరవ మర్యాదలతో స్వాగతము పలికి " ఈ సుందరిని అందరికంటె అధికుడవైన నీకు ఇచ్చి వివాహము చేయాలని అనుకున్నాను కాబట్టి నీవు ఈమెను పెండ్లాడి మమ్మలను సంతోషపెట్ట వలసింది" అని కోరాడు.

PDF created with pdfFactory trial version www.pdffactory.com

అందుకు మేరువు "నా శరీరము ఇంత పెద్దదైనా ఈ సుందరి వేషములో ఉన్న ఎలుక బొరియలు బొరియలు గా తొలిచి వేస్తుంది కాబట్టి ఈమెకు తగిన వరుడు మరొక ఎలుకే గాని నేను కాదు. కాబట్టి ఈమెను మరొక యెలుకకిచ్చి పెండ్లి చెయ్యి" అని చెప్పి వెళ్ళిపోయాడు.

అప్పుడు ఆ ముని "ఈ కన్యకి పెళ్ళి వయసు దాటిపోతే ధర్మము చెడుతుంది కాబట్టి దీనిని మళ్ళీ ఎలుక రూపములోనే ఉంచితే అసలు యే రకమయిన విచారము ఉండదు కదా" అని గ్రహించుకొని వెంటనే ఆ కన్యను తన అసలు రూపమైన ఎలుక రూపంలోకి మార్చేసాడు.

**పిల్లలూ మరి ఈ కథలో నీతి యేమిటి ?**
**నీచ ప్రాణికి ఔన్నత్యము కలిగిస్తే అది మేలు కలుగచేయదు అని,దానిని యథాస్థితిలో ఉంచటమే ఎప్పటికీ ఉత్తమము అని....**

Keywords: Telugu Chinna Pillala Kathalu, Pillala Neeti Kadhalu, Telugu lo chinna pillala kosam neeti kathalu, telugu short stories, kids stories , rishi, rushi eluka , dEga, kanya, eluka kanya katha, nIti kathalu, sUryuDu, vAyu dEvuDu, indruDu, mEruvu, mEru parvatam, elaka

www.maganti.org
Vamsi M Maganti
contact@maganti.org

PDF created with pdfFactory trial version www.pdffactory.com